# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 146 క్రిష్ణా, శుక్రవారం 20-02-2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## పెట్టుబడులే లక్ష్యంగా ఢిల్లీకి చంద్రబాబు..

### అంతర్జాతీయ దిగ్గజ సంస్థలతో కీలక ఒప్పందాలు



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 19: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీలో పర్యటించనున్నారు. అక్కడ ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సమ్మిట్'లో ఆయన పాల్గొని, ఏపీని టెక్నాలజీ హబ్‌గా మార్చే దిశగా అడుగులు వేయనున్నారు. ఈ సదస్సు వేదికగా ప్రపంచవ్యాప్తంగా వచ్చిన పారిశ్రామిక దిగ్గజాలతో ముఖ్యమంత్రి భేటీ కానుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్రాన్ని ఐటీ రంగంలో అగ్రగామిగా నిలపాలనే తన విజన్‌ను ఈ సందర్భంగా ఆయన పారిశ్రామికవేత్తలకు వివరించనున్నారు.

ఈ పర్యటనలో భాగంగా రాష్ట్ర భవిష్యత్తును మార్చే కీలకమైన మూడు ఒప్పందాలపై సంతకాలు జరగనున్నాయి. ప్రముఖ అంతర్జాతీయ సంస్థలైన ఐబీఎం యూఎన్ఐసీసీ మరియు ఎన్ఐఈఎల్ఐటీ లతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యూహాత్మక ఒప్పందాలను కుదుర్చుకోనుంది. ఈ భాగస్వామ్యాల ద్వారా రాష్ట్రంలోని యువతకు నైపుణ్యాభివృద్ధి, ఆధునిక సాంకేతికతలో శిక్షణ మరియు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది. తద్వారా అమరావతిని డిజిటల్ రాజధానిగా తీర్చిదిద్దే ప్రక్రియ మరింత వేగవంతం కానుంది.

కేవలం సంస్థలతోనే కాకుండా, అంతర్జాతీయ స్థాయి ప్రతినిధులతో కూడా చంద్రబాబు ముఖాముఖి చర్చలు జరపనున్నారు. బ్రిటన్ మంత్రిత్వ శాఖ ప్రతినిధులతో పాటు, గ్లోబల్ ఆయిల్ దిగ్గజం 'ఆరామ్‌కో ఇండియా' ప్రతినిధులు మరియు అడోబ్ ఇండియా సీఈఓలతో ఆయన ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఈ భేటీలలో రాష్ట్రంలో ఉన్న వనరులు, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు మరియు పెట్టుబడులకు ఉన్న అనుకూల వాతావరణాన్ని ఆయన వారికి వివరించనున్నారు. ఈ చర్చల ఫలితంగా భారీ ఎత్తున పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉంది.

ఒక రోజు అత్యంత బిజీ షెడ్యూల్ ముగించుకున్న అనంతరం, ముఖ్యమంత్రి శుక్రవారం సాయంత్రమే ఢిల్లీ నుండి బయలుదేరి తిరిగి అమరావతికి చేరుకుంటారు. ఈ స్వల్పకాలిక పర్యటన రాష్ట్ర ఆర్థిక ప్రగతికి ఒక కొత్త దిశను చూపిస్తుందని రాజకీయ మరియు పారిశ్రామిక వర్గాలు విశ్లేషిస్తున్నాయి. పారిశ్రామికవేత్తలను నేరుగా కలిసి భరోసా ఇవ్వడం ద్వారా, ఏపీ పట్ల ఇన్వెస్టర్లలో నమ్మకాన్ని పెంచేందుకు చంద్రబాబు ఈ పర్యటనను వేదికగా చేసుకున్నారు.

## హెరిటేజ్.. నాణ్యతలో రాజీ పడబోం:



క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 19 33 ఏళ్లుగా ప్రతి ఇంటికీ తాజా, ఆరోగ్యకరమైన పాల ఉత్పత్తులు అందిస్తూ, ప్రతి పాడి రైతుకూ సాధికారత కల్పించడమే హెరిటేజ్ లక్ష్యమని హెరిటేజ్ ఫుడ్స్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి వ్యాఖ్యానించారు. రైతుల సాధికారత, పారదర్శకత కోసం తమ సంస్థ పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం(ఎక్స్)లో నారా భువనేశ్వరి ట్వీట్ పెట్టారు. రూ. 4 కోట్ల సంస్థగా ప్రారంభమై రూ. 4,000 కోట్ల సంస్థగా ఎదిగినా.. నాణ్యత విషయంలో ఎప్పుడూ రాజీ పడలేదని నారా భువనేశ్వరి స్పష్టం చేశారు. అన్ని ఉత్పత్తులూ 25 నాణ్యత పరీక్షలు దాటిన తర్వాతే.. మీ ఇంటికి చేరుతున్నాయని చెప్పారు. 500కి పైగా నిపుణులు ఈ ప్రమాణాలను పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. తొమ్మిది రాష్ట్రాల్లో దాదాపు 3 లక్షల మంది రైతులతో తాము పారదర్శకత, న్యాయమైన ధర, సమయానికి చెల్లింపులు అనే సూత్రాలపై ముందుకు సాగుతున్నామని వ్యాఖ్యానించారు. ఈ వీడియోను పూర్తిగా వీక్షించి నిజాన్ని మీరే చూడండి. ఎందుకంటే --- చూసిందే నమ్మండని నారా భువనేశ్వరి పేర్కొన్నారు.

## తిరుమల లడ్డూ కల్తీపై వైసీపీ నేతలు చెప్పింది అబద్ధం: మంత్రి అచ్చెన్నాయుడు



క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 19: వైసీపీపై మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మంత్రి మాట్లాడుతూ.. మూడు రోజుల నుంచి సంబంధం లేని విషయాలు తీసుకువచ్చి సభా సమయాన్ని వైసీపీ సభ్యులు వృధా చేస్తున్నారని మండిపడ్డారు. శాసనమండలిలో తిరుపతి లడ్డూలో కల్తీ జరుగలేదని వైసీపీ నాయకులు చెప్పింది అబద్ధమని మంత్రి ఆరోపించారు. కల్తీ నెయ్యి అంశంపై చర్చ జరపాలంటే ముందు వారు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తిరుమల లడ్డూ నెయ్యిలో కల్తీ జరిగిందని మాజీ టీటీడీ చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి స్పష్టంగా చెప్పారని మంత్రి గుర్తు చేశారు. తిరుమల లడ్డూ నెయ్యిలో కల్తీ జరిగిందని అన్ని నివేదికలు నిర్ధారించాయని, అందుకే కూటమి ప్రభుత్వం పాత టెండర్లను రద్దు చేసి కొత్త టెండర్లను పిలిచిందని మంత్రి వివరించారు. కొత్త టెండర్లలో కిలో నెయ్యి 650 రూపాయలకు ఇచ్చారని చెప్పారు. కిలో నెయ్యి 350 రూపాయలకు ఎక్కడ ఇచ్చారో వైసీపీ సభ్యులు చూపించాలని అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు.

హెరిటేజ్ డైరీ.. ఉన్నత ప్రమాణాలకు పెట్టింది పేరన్నారు మంత్రి. చంద్రబాబు రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కుటుంబం సభ్యులకు అప్పగించారని తెలిపారు. ప్రభుత్వం నుంచి హెరిటేజ్‌తో ఎటువంటి లావాదేవీలు జరుపకూడదని పాలసీ నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. కల్తీ నెయ్యి మీద చర్చకు అనుమతి ఇవ్వాలంటే, కల్తీ జరుగలేదని చెప్పిన వైసీపీ నాయకులు ముందు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చీజ్ ప్యాకెట్ చూపించి నెయ్యి ప్యాకెట్ అని చెప్పడం దుర్మార్గమని మండిపడ్డారు. నెయ్యి కల్తీ కాలేదని చెబుతున్న వైసీపీ మాటలన్నీ కల్తీ మాటలే అని మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు చేశారు.

## హిందూపురంలో పర్యటించిన బాలకృష్ణ

క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 19: హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తన నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గురువారం లేపాక్షి మండలంలో పర్యటించిన ఆయన, రెండు కీలకమైన బీటీ రహదారుల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వివరాల్లోకి 2 లో

## యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యం: మంత్రి నారా లోకేశ్



క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 19 యువతకు పెద్దఎత్తున ఉద్యోగాల కల్పనే తమ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. అందుకు అనుగుణంగా అధికారులు రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు. కోచింగ్ సెంటర్ల నిర్వహణపై సుప్రీంకోర్టు మార్గదర్శకాల అమలుపై రివ్యూ చేశారు. విద్యాశాఖ ఉన్నతాధికారులతో మంత్రి లోకేశ్ ఇవాళ(గురువారం) సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులకు మంత్రి లోకేశ్ మార్గనిర్దేశం చేశారు. జాబ్ క్యాలెండర్‌తో పాటు యూనివర్సిటీల్లో అధ్యాపక పోస్టుల భర్తీకి కసరత్తు చేస్తున్నామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

మంత్రి నారా లోకేశ్ ఇవాళ (గురువారం) రాత్రి ఉండవల్లి నివాసంలో.. ఒంగోలు, బాపట్ల కూటమి ప్రజాప్రతినిధులు, వారి కుటుంబసభ్యులకు ఆత్మీయ విందు ఇచ్చారు. ఈ విందు భేటీ వేడుకలా జరిగింది. నిత్యం రాజకీయాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, నియోజకవర్గ సమస్యలతో క్షణం తీరికలేకుండా గడిపే ప్రజాప్రతినిధులకు.. మంత్రి నారా లోకేశ్ ఆత్మీయ విందు ఇచ్చారు. మూడు గంటల పాటు రాజకీయాలతో సంబంధంలేని సరికొత్త ఆనంద ప్రపంచంలో ఉంచారు. నో పాలిటిక్స్.. నో అసెంబ్లీ డిస్కషన్స్.. సరదా సంభాషణలు.. ఆట పట్టించుకోవడం.. ఇలా ఫుల్ జోష్‌తో ఆత్మీయ విందు సాగింది.

## ఏపీకి వైసీపీ హానికరం.. జగన్‌పై పయ్యావుల తీవ్ర వ్యాఖ్యలు..



క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 19: 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై జరిగిన చర్చలో భాగంగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో సమాధానం ఇచ్చారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూనే.. వైసీపీ గత పాలనపై మంత్రి మండిపడ్డారు. 'వైసీపీ నెవర్ ఎగైన్.. కూటమి వన్స్ ఎగైన్' అంటూ అసెంబ్లీ వేదికగా పయ్యావుల వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి వైసీపీ హానికరం అనే స్టాట్యూటరీ వార్నింగ్ నిరంతరం ఇస్తూనే ఉండాలని స్పష్టం చేశారు. ఇజ్రాయిల్ దేశస్థుల తరహాలో ప్రజలు కూడా మన రాష్ట్రం అనే భావనను పెంపొందించుకోవాలని సూచించారు.

వడ్డీ రేట్లు తగ్గేలా చర్యలు..

అధిక వడ్డీలతో తెచ్చిన రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించేలా సంప్రదింపులు జరుపుతున్నామని మంత్రి వెల్లడించారు. సుమారు రూ. 2 వేల కోట్ల మేర వడ్డీలు తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఏడాదికి రూ. 2 వేల కోట్లు ఆదా అయితే.. చాలా పథకాలు సమర్థవంతంగా అమలు చేయవచ్చన్నారు మంత్రి. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే మైనింగ్ శాఖలో 33 శాతం, ఎక్సైజ్ శాఖలో 24 శాతం ఆదాయం పెరిగిందని వివరించారు. గత ప్రభుత్వంలో గనులు, ఎక్సైజ్ ఆదాయం తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లిందని వైసీపీపై పయ్యావుల విమర్శలు గుప్పించారు.

భూకేటాయింపుల్లో లాభాలు, నష్టాలు..

కూటమి జరిపిన భూ కేటాయింపుల వల్ల కలిగిన లాభాలను.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిపిన భూ కేటాయింపుల వల్ల కలిగిన నష్టాలను మంత్రి సభలో ఏకరువు పెట్టారు. సీఎం చంద్రబాబు హయాంలో భూములు కేటాయిస్తే... కియా, హెచ్‌సీఎల్, అశోక్ లేలాండ్, హీరో కంపెనీ, టీసీఎస్, కాగ్నిజెంట్, గూగుల్ ఏఐ డేటా సెంటర్ వంటి సంస్థలు వచ్చాయని తెలిపారు. వైసీపీ హయాంలో ఇచ్చిన భూముల్లో ఒక్క కంపెనీ కూడా రాలేదని గుర్తుచేశారు. లేపాక్షి నాలెడ్జ్ హబ్, వ్యాన్ పిక్, బ్రాహ్మణి స్టీల్స్‌కు భూములిచ్చినా.. ఒక్క ఎంఎస్ఎంఈ కూడా రాలేదని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌పై...రాయలసీమ హార్టికల్చర్ హబ్ అంశంపై సభలో పయ్యావుల ఆసక్తికర కామెంట్లు చేశారు. సీఎం చంద్రబాబు తీసుకున్న చొరవతో పరిశ్రమల్లోనే కాదు.. పొలాల్లో కూడా పెట్టుబడులు పెడుతున్నారని తెలిపారు. ఢిల్లీ నుంచి వచ్చి కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని పొలాలను కొంటున్నారని, దానిమ్మ పండిస్తున్నారని వెల్లడించారు. చంద్రబాబు చొరవతో రాయలసీమ ఉత్పత్తులకు అరకు తరహాలో అంతర్జాతీయ బ్రాండింగ్ రాబోతోందంటూ సంతోషం వ్యక్తం చేశారు.

జగన్‌పై విమర్శలు.. అలాగే, రాయలసీమ ప్రాజెక్టులకు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన ద్రోహాన్ని మంత్రి పయ్యావుల వివరించారు. 102 రాయలసీమ ప్రాజెక్టులను ఒక్క సంతకంతో రద్దు చేశారని జగన్‌పై ఫైర్ అయ్యారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును నిర్మించడం లేదని నాడు కేంద్రానికి అప్పటి ఇరిగేషన్ స్పెషల్ సీఎస్‌గా ఉన్న ఆదిత్యనాథ్ దాస్ స్పష్టం చేశారంటూ డాక్యుమెంట్లను మంత్రి పయ్యావుల కేశవ్ సభలో ప్రవేశపెట్టారు.

## హిందూపురంలో పర్యటించిన బాలకృష్ణ

వెళ్తే, మండలంలోని మానేపల్లి నుంచి గౌరిగానిపల్లి వరకు రూ.2.60 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రహదారి నిర్మాణ పనులను బాలకృష్ణ లాంఛనంగా ప్రారంభించారు. ఈ రహదారి పూర్తయితే స్థానిక గ్రామస్తులకు రవాణా కష్టాలు తీరుతాయని తెలిపారు. అనంతరం ఆయన పులమతి చెరువు వద్దకు చేరుకుని, హంద్రీనీవా జలాలకు ప్రత్యేక పూజలు చేసి జలహారతి ఇచ్చారు. ఇదే పర్యటనలో భాగంగా కొత్తపల్లి నుంచి నాగేపల్లి వరకు నిర్మించనున్న మరో రహదారి పనులకు కూడా బాలకృష్ణ భూమిపూజ నిర్వహించారు.

## ఆర్సీఎం చర్చి పునర్నిర్మాణ కార్యక్రమం..





ఎన్టీఆర్ జిల్లా,ఇబ్రహీంపట్నం,ఫిబ్రవరి 19(క్రైం కౌంటర్ డెస్క్):మండలం లోని కిలేశపురం గ్రామంలో ఆర్సీఎం చర్చి పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఇబ్రహీంపట్నం విచారణ గురువులు బెల్లంకొండ అనీల్ కుమార్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్ వి.సురేష్ బాబు (ప్రొవిన్షియల్ సుపీరియర్) ముఖ్య అతిధిగా హాజరైయ్యారు. ప్రత్యేక ప్రార్థన ఆనంతరం పాత చర్చి ప్రాంగణంలో శంకుస్థాపన జరిపారు. పలువురు భక్తులు నవధాన్యాలు, పసువు కుంకుమ లు వేసి కొబ్బరి కాయలు కొట్టారు. సుమారు 60ఏళ్ల క్రితం నిర్మించిన చర్చిలో ఆర్సీఎం సంఘస్తులు ఇప్పటి వరకు ప్రార్థనా కార్యక్రమాలు నిర్వహించారు. 1977 తుఫాన్ సమయంలో పేదల పూరి పాకలు కూలిపోయిన తరుణంలో ఈచర్చిలోనే గ్రామస్తులు ఆశ్రయం పొందారు. పాత చర్చి స్థానంలో నూతన చర్చి నిర్మాణంకు సంఘస్తులు తలపెట్టారు.

## గోదావరి డెల్టాలో లైడార్ సర్వే

క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 19: పశ్చిమ డెల్టాలో కాలువ నెట్‌వర్క్ ఏర్పడి 150 ఏళ్లయ్యింది. అప్పట్లో జలరవాణా ఉండేది. దశాబ్దాలు గడచిపోయాయి. డెల్టా స్వరూపం మారింది. కాలువలు పూడుకుపోయాయి. ఇరిగే షన్ స్థలాలు ఆక్రమణలకు, కొన్నిచోట్ల కోతకు గురయ్యాయి. గోదావరిలో పుష్కలంగా నీరున్నా డెల్టా శివారు ప్రాంతాలకు అందడం లేదు. గుప్పెడు నీరు తాగేందుకు వీలు లేకుండా పోయింది. కాలువలు కాలుష్యంగా మారాయి. అధిక వర్షాలు కురిస్తే పొలాలు ముంపు బారిన పడుతున్నాయి. వందల కోట్ల రూపాయలు వెచ్చించి ఆధునికీకరణ చేపట్టినా ఫలితం లేకపో యింది. ఫలితంగా కూటమి ప్రభుత్వం వివరణా త్మక సర్వే కోసం చర్యలు తీసుకుంది.

పూర్వ ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని డెల్టా ప్రాంతాన్ని లైడార్ (లైట్ డిటెక్షన్ అండ్ రేంజింగ్) సర్వే ద్వారా అంచనా వేసేందుకు కార్యాచరణ రూపొందించింది. ఇందుకు రూ.14 కోట్లు మంజూరు చేసి సర్వేను ప్రారంభించారు. పౌర విమానయాన శాఖ అనుమతితో ఫ్లైట్ ద్వారా సర్వే చేస్తున్నారు. నాలుగు దశల్లో సర్వే చేపట్టనున్నారు. ఈ నెల నాలుగో తేదీ నుంచి తొలి దశ సర్వే ప్రారంభించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సర్వే పూర్తిచేశారు. పశ్చిమ డెల్టా పరిధిలో సర్వే నిర్వహిస్తున్నారు. మరో 20 రోజుల్లో ఇది పూర్తవుతుంది. ఆరు నెలలపాటు నాలుగు దశల్లో సర్వే పూర్తయిన తర్వాత ప్రభు త్వానికి సమగ్ర నివేదికను సమర్పించనున్నారు. ప్రతి చదరపు మీటరు విస్తీర్ణంలో ఉన్న అంశా లను వివరాణాత్మకంగా తెలియనుంది. తద్వారా డెల్టా స్థిరీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభు త్వం ఒక నిర్ణయం తీసుకోనుంది. ఆధునికీకరణ పనులు చేపట్టనుంది. ముఖ్యంగా ప్రస్తుత డెల్టా పరిస్థితి ఏమిటి ? ఎక్కడ కాలువలు కోతకు గురయ్యాయి? ఆక్రమణలు ఏ మేరకు జరిగాయి. కాలువలు, డ్రెయిన్ల పరిస్థితి ఏమిటి ? ఏ మేరకు పూడుకు పోయాయి. ఇలా అన్ని వివరా లతో సర్వే నివేదికను రూపొందించనున్నారు. మ్యాప్‌లు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేయ నున్నారు. సర్వేలో గోదావరి డెల్టా పరి?ధిలో కాలు ష్యాన్ని పసిగట్టనున్నారు. కాలుష్యం వల్లే గోదా వరి జలాలు తాగడానికి ఉపయోగించలేని పరి స్థితి ఏర్పడింది. మరోవైపు శివారు ప్రాంతాలకు సాగు నీరందడం లేదు. కొద్దిపాటి వర్షాలు కురు స్తున్నా సరే లోతట్టు ప్రాంతాలు ముంపు బారిన పడుతున్నాయి. రైతులు నష్టపోతున్నారు. భవిష్య త్తులో ఇటువంటి సమస్యలు లేకుండా ఆధుని కీకరణ పనులు చేపట్టేందుకు లైడార్ సర్వే దోహ దపడనుంది. డెల్టా పరిధిలోని ప్రధాన కాలువ లతోపాటు, పంట బోదెల వరకు సర్వే ద్వారా నివేదిక రూపొందిస్తారు.

# కొండల మధ్యలో బ్రహ్మయ్యలింగేశ్వర స్వామి ఆలయం

**బ్రహ్మయ్యలింగం చెరువు**
**పర్యాటకాభివృద్ధికి ఒమన్ దేశం ఆసక్తి**
**2023లోనే ప్రతిపాదించిన ఆ దేశాధినేత**
**సీఎం దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే యార్లగడ్డ**
**త్వరలో ఆ దేశంతో సంప్రదింపులు**
**రూ.350 కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం**



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 19: విజయవాడ) : బ్రహ్మయ్యలింగం చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఒమన్ దేశం ఆసక్తి చూపిస్తోంది. ఆ దేశానికి చెందిన అధ్యక్షుడు సుల్తాన్ బిన్ తారిఖ్ ఈ చెరువు గురించి తెలుసుకుని ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి వ్యక్తీకరణ కనబరుస్తున్నారు. ఈ అవకాశాన్ని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అందుకోవాలని భావిస్తున్నారు. ఒమన్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి పీపీపీ విధానంలో చెరువుకు మహర్దశ కలిగించాలని చూస్తున్నారు. ఇటీవల అమరావతిలో జరిగిన కృష్ణాజిల్లా ప్రజాప్రతినిధుల సమావేశం సందర్భంగా ఈ విషయాన్ని సీఎం చంద్రబాబుతో పంచుకున్నట్టు తెలిసింది. రూపాయి ఖర్చు కాకుండా ముందుకు వెళ్లొచ్చని యార్లగడ్డ వివరించారు.

2023 నాటి ప్రతిపాదన

2023లో ఒమన్ అధినేత మన దేశంలో పర్యటించారు. దేశంలోని పలు ప్రాంతాల గురించి తెలుసుకునే క్రమంలో బ్రహ్మయ్యలింగం చెరువు గురించి కూడా ఆరా తీసినట్టు సమాచారం. ఒమన్ దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్న ఆయన.. ఆ క్రమంలోనే పర్యాటక రంగానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని భావించారు. పలు దేశాలతో ఆయన జరిపిన ద్వైపాక్షిక చర్చల్లో ఈ అంశాలను ప్రస్తావించారు. మన దేశానికి వచ్చినపుడు బ్రహ్మయ్యలింగం చెరువు గురించి తెలుసుకున్న ఆయన పర్యాటక పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి వ్యక్తం చేయటం విశేషం. ఆ తర్వాత కార్యాచరణలోకి రాలేదు. తాజాగా ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు త్వరలో ఆ దేశంతో సంప్రదింపులు జరపాలని భావిస్తున్నారు. ఒకవేళ పర్యాటకాభివృద్ధి జరిగితే రూ.350 కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది.

మహిమాన్విత చరితం

బ్రహ్మయ్యలింగం చెరువుకు మూడో శతాబ్దం నుంచి ఘన చరిత్ర ఉంది. ఇక్కడి కొండ (బ్రహ్మ కైలాసం)పై బ్రహ్మయ్య లింగేశ్వరస్వామి ఆలయం ఉంది. 1,200 ఎకరాల్లో విస్తరించి ఉంది. వాటర్ స్పోర్ట్స్‌కు ఈ ప్రాంతం అనుకూలం. కాటేజీలు, రెస్టారెంట్లు, ఇతర రిక్రియేషన్స్ ఎన్నింటినో అభివృద్ధి చేసేందుకు భూములు ఉన్నాయి. అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్‌ఆర్).. బ్రహ్మయ్యలింగం చెరువు, ఆ కొండలు, ప్రకృతి సోయగాల ప్రాంతాన్ని ఆనుకుని వెళ్తుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు భూ సేకరణ మొదలైంది. ఓఆర్‌ఆర్ సాకారమైతే.. బ్రహ్మయ్యలింగం చెరువుకు మార్గం సుగమమవుతుంది.

# యూనివర్సిటీకి సమీపంలోని డంపింగ్ యార్డులో చెత్తకుప్పలు



**కృష్ణా వర్సిటీ సమీపంలో భారీగా చెత్త డంప్**
**మున్సిపల్ అధికారుల అనాలోచిత నిర్ణయం**
**కంపుతో విద్యార్థులు, అధ్యాపకులు, స్థానికుల అవస్థలు**
**మచిలీపట్నంలోని యార్డును రుద్రవరానికి మార్చడం వల్లే..**

క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 19: మచిలీపట్నం : మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో రోజువారీ సేకరించే చెత్తను మొదట్లో శివారున ఉన్న డంపిగ్ యార్డుకు తరలించేవారు. అక్కడ తడిచెత్త, పొడిచెత్త ప్రాసెసింగ్ సక్రమంగా చేయకపోవడంతో 2 లక్షల టన్నులకుపైగా వ్యర్థాలు పేరుకుపోయాయి. 2024, అక్టోబరు 2న మహాత్మాగాంధీ జయంతి, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు మచిలీపట్నం వచ్చారు. ఆ సమయంలో మచిలీపట్నం డంపింగ్ యార్డును పరిశీలించారు. ఇక్కడ పేరుకున్న చెత్తను తొలగించాలని అధికారులను ఆదేశించారు. కాగా, కొంతకాలంగా ఆ చెత్తను ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన యంత్రాల ద్వారా గుంటూరులోని జిందాల్ పవర్ ప్రాజెక్టుకు తరలించారు. అయినా డంపింగ్ యార్డులో చెత్తగుట్టలు అలాగే ఉండిపోయాయి. దీంతో ఇటీవలకాలంలో మచిలీపట్నం మండలం రుద్రవరంలోని కృష్ణా యూనివర్సిటీ సమీపంలోని భూముల్లోకి చెత్తను తరలించడం ప్రారంభించారు. భారీగా తరలించడంతో అక్కడ చెత్త గుట్టలు పేరుకుపోయి వర్సిటీ పరిసర ప్రాంతాలు కంపుకొడుతున్నాయి.

వైసీపీ హయాంలో భూమి కేటాయింపు

వైసీపీ హయాంలో రుద్రవరం రెవెన్యూ గ్రామ పరిధిలోని డంపింగ్ యార్డు కోసం 14 ఎకరాలు సేకరించారు. ఈ యార్డును యూనివర్సిటీకి దూరంగా ఉన్న బందరు వెస్ట్ రెవెన్యూ గ్రామ పరిధిలోని గరాలదిబ్బకు దూరంగా ఉన్న ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేస్తామని అప్పట్లో ప్రకటించి, ఆ భూములను పరిశీలించారు. ఈ ప్రాంతంలో భీమవరానికి చెందిన బడాబాబులకు చేపల చెరువులు ఉన్నాయి. ఆ భూముల స్థానే.. వారే డంపింగ్ యార్డుకు భూములు కొని ఇవ్వాలనే ప్రతిపాదనను అప్పటి వైసీపీ పాలకులు పెట్టారు. వారిపై సామదానదండోపాయాలు ప్రయోగించి తమ దారిలోకి తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలోనే భీమవరం బడాబాబులు వర్సిటీ సమీపంలోని 14 ఎకరాలను డంపింగ్ యార్డుకు ఇచ్చారనే ప్రచారం జరిగింది. ఈ భూమినే ప్రస్తుతం డంపింగ్ యార్డుగా మార్చారు. కాగా, యూనివర్సిటీకి సమీపంలో చెత్తను వేయొద్దని విద్యార్థులు, అధ్యాపకులు, రుద్రవరం గ్రామస్తులు కోరుతున్నారు. దీంతో ఇటీవల చెత్త తరలింపును నిలిపేశామని మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు తెలిపారు.

విద్యార్థులు, అధ్యాపకులు, స్థానికుల అగచాట్లు

కృష్ణా వర్సిటీ ఇంజనీరింగ్ విభాగంలోనే వెయ్యిమంది విద్యార్థులు చదువుతున్నారు. వీరితో పాటు ఫార్మసీ కళాశాల, వివిధ పీజీ కోర్సుల్లో మరో 400 మందికి పైగా విద్యార్థులున్నారు. అధ్యాపకులు, స్టాఫ్ మరో 150 మందికిపైగా ఉంటారు. వచ్చే జూన్ నాటికి యూనివర్సిటీ ప్రాంగణంలోనే బాలికల వసతిగృహం కూడా ప్రారంభమవుతుంది. ఇంతమంది ఇక్కడ విద్యాభ్యాసం చేస్తుంటే అధికారులు ముందు, వెనుకా ఆలోచించకుండా డంపింగ్ యార్డు పేరుతో యూనివర్సిటీకి సమీపంలో చెత్తను వేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. యూనివర్సిటీ పక్కనే సాంఘిక సంక్షేమశాఖ గురుకుల జూనియర్ కళాశాల ఉండగా, అందులో 500 మంది విద్యార్థులు ఉన్నారు. గురుకుల జూనియర్ కళాశాల పక్కనే రుద్రవరం గ్రామం, ఇటీవల నిర్మించిన నూతన కాలనీల్లో ప్రజలు నివాసం ఉంటున్నారు.

# డ్రోన్ కెమెరాలతో పోలీసుల ప్రత్యేక నిఘా

క్రైం కౌంటర్ న్యూస్, భీమవరం క్రైం, ఫిబ్రవరి 19 ఇలా జిల్లాలో ఏదో మూల అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. వాటిని అరికట్టేందుకు పోలీసులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూనే ఉన్నారు. కోడిపందేలు, పేకాట, జూదాలతో పాటు అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగంగా మద్యం సేవించడం.. వంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు పోలీసులకు డ్రోన్‌లు ఎంతో ఉపయోగపడుతున్నాయి. డ్రోన్ కెమెరాల ద్వారా ఏరియల్ వ్యూ తీసుకుని ఎక్కడ ఎటువంటి కార్యకలాపాలు జరిగినా నిముషాల వ్యవధిలో పోలీసులు అక్కడికి చేరుకుని అరెస్టు చేస్తున్నారు. ఊరికి దూరంగా ఉండే ఖాళీ స్థలాలు పేకాట, కోడి పందేలకు స్థావరాలుగా ఉంటాయి. అలాంటి ప్రదేశాల్లో మద్యం, గంజాయి వంటివి సేవిస్తుంటారు. అలాంటి స్థావరాలను కని పెట్టాలంటే పోలీసులకు గతంలో ఇబ్బందికరంగా ఉండేది. డ్రోన్ కెమెరాలు రావడంతో ఎక్కడ ఏ మూల దాక్కున్నా దొంగలు దొరి కేస్తున్నారు. జిల్లాలో మూడు కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా పెట్టారు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారికి తెలియకుండానే డ్రోన్ కెమెరాలు నిఘా పెట్టి వారిని ఫొటోలు, వీడియోలు తీయడం, వాటిని పోలీసు శాఖ స్టేషన్లలో తనిఖీలు చేసుకుని ఆ ప్రాంతాలకు వెళ్లి వారిని అరెస్ట్ చేస్తున్నారు.

గతేడాది 20 కేసులు2025 జనవరి నుంచి 2026 జనవరి వరకు అసాంఘిక కార్యకలాపాలపై 20 కేసుల వరకు నమోదు చేశారు. డ్రోన్ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘాపెట్టి వాటి ద్వారా 20 కేసులు నమోదు చేసినట్లుగా జిల్లా పోలీసు కార్యాలయం అధికారులు తెలిపారు. ప్రస్తుతం మూడు డ్రోన్ కెమెరాలు జిల్లా పోలీసు కార్యాలయంలో ఉన్నాయి. జిల్లాలోని 25 పోలీస్ స్టేషన్లలో ఏ పోలీస్ స్టేషన్‌కు అవసరం వచ్చినా అక్కడకు డ్రోన్ కెమెరాను పంపిస్తారు. ఆ కెమెరా ద్వారా నిఘా పెట్టి అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తీసుకుంటున్నారు. ఈ విధంగా చేయడం వల్ల కొన్ని కేసులు



సులువుగా పరిష్కారమయ్యాయని పోలీసులే చెబుతున్నారు. డ్రోన్ కెమెరాల ఉపయోగం చాలా వరకు ఉందని చెబుతున్నారు. రానున్న రోజుల్లో ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఎంత అభివృద్ధి చెందుతుందో ఆ విధంగానే డ్రోన్ కెమెరాల ఉపయోగం కూడా అంతగా ఉంటుందని చెబుతున్నారు. మొత్తం మీద అసాంఘిక కార్యకలాపాలు, జూదాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు చేపట్టిన ప్రయోగం చాలావరకు సక్సెస్ అయ్యింది. కెమెరా మూడో కన్నుపై ఆకతాయిలు హడలిపోతున్నారు. నేరాల అదుపునకు డ్రోన్ కెమెరాల సహకారండ్రోన్ కెమెరాల వల్ల అసాంఘిక కార్యకలాపాలు, జూదాలకు చాలా వరకు అడ్డుకట్ట వేయగలుగుతున్నాం. ఎక్కడైనా జూదాలు, అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగంగా మద్యం సేవించడం వంటివి జరుగుతున్నాయని సమాచా రం ఉంటే ముందుగా డ్రోన్ కెమెరాలను పంపించి ఆ పరిసరా లను తెలుసుకుని అక్కడకు వెళ్లి వారిని అరెస్ట్ చేస్తున్నాం. ప్రస్తు తం జిల్లాలో మూడే ఉన్నాయి. త్వరలోనే మరిన్ని అందుబాటులోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు.

# హిందూ ధర్మ పరిరక్షకుడు ఛత్రపతి శివాజీ



క్రైం కౌంటర్ న్యూస్, అరసవల్లి, ఫిబ్రవరి 19 హిందూ ధర్మ పరిరక్షకుడిగా, దేశం కోసం, దైవం కోసం పోరాడిన మహా యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ అని, భారతీయుల గుండెల్లో ఆయన ఆరని జ్యోతి అని పలువురు వక్తలు అన్నారు. నగరంలోని శాంతినగర్ కాలనీలోని స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనంలో ఛత్రపతి శివాజీ జయం తిని గురువారం నిర్వహించారు. తొలుత ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. శివాజీ గొప్పదనాన్ని కీర్తిస్తూ అవధాని పైడి హరనాథరావు గేయం ఆలపించారు. కార్య క్రమంలో గాంధీ మందిరం సభ్యులు డా.చింతాడ కృష్ణ మోహన్, పి.రాజశేఖర్, ఎం.అనంత భట్లు, పందిరి అప్పా రావు, తర్లాడ అప్పలనాయుడు, జామి భీమశంకరరావు, జి.నా గేశ్వరరావు, సువ్వారి రాజారావు, ఎంవీవీఎస్ శాస్త్రి తదిత రులు పాల్గొన్నారు.

రణస్థలంలో..

మండల కేంద్రం లోని ఒక ప్రైవేటు కళాశాలలో ప్రఖండ ప్రముఖ్ కె.రాజ శేఖర్ ఆధ్వర్యంలో గురువారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీహెచ్‌పీ ఉత్తరాంధ్ర ప్రతినిధులు పొగిరి సూర్యనారాయణ, బొంతు రమణ మాట్లాడుతూ భారతావని లోకానికి అందించిన చారిత్రక పురుషుడు శివాజీ అని కొనియాడారు. పలువురు స్థానిక ప్రతినిధులు పాల్గొ న్నారు.

టెక్కలిలో శోభాయాత్ర

: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా గురువారం బీజేపీ, ఆర్ఎస్ ఎస్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో టెక్కలిలో శోభా యాత్ర నిర్వహించారు. స్థానిక డిగ్రీ కళాశాల నుంచి ఇందిరా గాంధీ కూడలి మీదుగా అంబేద్కర్ కూడలి వరకు జై శివాజీ అంటూ నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బూరి నరేంద్ర చక్రవర్తి, జర్జాన రామ్‌జీ, రాజ కుమార్ రెడ్డి, లక్ష్మీనారాయణ, ఆనందరావు, చంద్రశేఖర్ పట్నాయక్, బొడ్డ అయ్యబాబు, గేదెల చంద్రశేఖరరెడ్డి తదితరుల పాల్గొన్నారు.

పోరాట యోధుడు శివాజీ

స్వరాజ్య సాధన కోసం మొఘల్ చక్రవర్తులతో జీవితాంతం పోరాడిన మరాఠీ యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ అని పలువురు కొనియాడారు. పలాస మండలం గోపాలపురంలో గురువారం ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహా నికి హిందూ అభిమానులు, శివాజీ యువసేన ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఊరేగింపు నిర్వహిం చారు. కార్యక్రమంలో వివిధ సంఘాల సభ్యులు కొక్కిరి దేవదత్తం, కిషోర్ పాత్రో, వీహెచ్‌పీ సభ్యులు చంద్రమౌళి, విజయ కుమార్ పట్నాయక్, బీజేపీ నాయకులు పురుషోత్తం త్యాడి, కొక్కిలి శ్రీను తదితరులు పాల్గొన్నారు. కాశీబుగ్గలో బీజేపీ నాయకులు వైకుంఠరావు, తారకేశ్వరావు, రామానందస్వామి ఆధ్వర్యంలో గురువారం ఛత్రపతి శివాజీ జయంతిని నిర్వ హించారు. పార్టీ నాయకులు మోహన్‌రాజ్, దుదిష్టి, భుజంగ రావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణారావుపాలెం సేంద్రియ మేళాకు పటిష్ట ఏర్పాట్లు..

## -జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ

ఎన్టీఆర్ జిల్లా,ఎ.కొండూరు,ఫిబ్రవరి 19(క్రైం కౌంటర్ బ్యూరో చీఫ్ సల్మాన్):మండలం లోని కృష్ణారావుపాలెంలో భారీస్థాయిలో జిల్లాస్థాయి సేంద్రియ మేళా ఫిబ్రవరి నెల 21వ తేదీ న కార్యక్రమాన్ని నిర్వహించనున్నా సందర్భంగా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తెలిపారు. గురువారం జేసీ ఇలక్కియ మరియు తిరువూరు ఆర్‌డీవో కె.మాధురితో కలిసి మేళా జరిగే ప్రాంతంలో ఏర్పాట్లపై సమన్వయ శాఖల అధికారులు, భాగస్వామ్య పక్షాలతో సమావేశమయ్యారు. శిక్షణ, అవగాహన కార్యక్రమాలు, స్టాళ్ల ఏర్పాటు, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన తదితరాలకు చేస్తున్న ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జేసీ ఇలక్కియ మాట్లాడుతూ రైతులు, వినియోగదారులు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సేంద్రియ ఉత్పత్తులపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, సేంద్రియ సాగుపై రైతులకు సామర్థ్య అభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం లక్ష్యంగా జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో ఈ మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేళాలో సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయ స్టాళ్లు ఉంటాయని, సేంద్రియ సాగుకు అవసరమైన ఉత్పాదితాలను కూడా ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ రైతులు, వినియోగదారులు, సంస్థలను ఒకే వేదికపైకి తీసుకొచ్చే లక్ష్యంతో ఈ నెల 22వ తేదీన విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ మైదానంలో ప్రకృతి వ్యవసాయ మేళాను నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఇలక్కియ తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం వై.శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రెండున్నర నెలల నుంచి ఆకలి కేకలు

క్రైం కౌంటర్ న్యూస్, కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 19 : గ్రామాల్లో ఉపాధి కూలీల ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. నవంబరు నెల తర్వాత ఈ నెల ఇప్పటి వరకు పనులు చేసిన సుమారు రెండున్నర నెలలు గడిచిపోయినా తమ చేతికి ఒక్క రూపాయి కూడా అందకపోవడంతో గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టేందుకు వ్యవసాయ కూలీలు, రైతులు మాకొద్దు ఈ పనులు దేవుడా.. అంటూ వలసబాట పడుతున్నారు. ప్రభుత్వం ఏదో ఒక రోజు వేతనం విడుదల చేస్తుందని నీటి యాజమాన్య సంస్థ అధికారులు నచ్చచెబుతున్నా వ్యవసాయ కూలీలు మాత్రం గ్రామాల్లో అధికారులు చేపట్టిన పనులకు రాలేమని మొఖం మీదనే చెబుతున్నారు. గ్రామాల్లో వ్యవసాయ కూలీలందరికీ పనులు కల్పించాలని నీటి యాజమాన్య సంస్థ అధికారులు కింది స్థాయి సిబ్బందికి లక్ష్యాలను నిర్దేశిస్తున్నారు. కర్నూలు జిల్లాలో ప్రతి రోజు 50వేల మందికి పనులు కల్పించాలని జిల్లా అధికారులు ఆదేశిస్తున్నారు. అయితే కేవలం 23,411 మంది మాత్రమే పనులకు వస్తున్నట్లు నీటి యాజమాన్య సంస్థ అధికారులు తెలిపారు. నంద్యాల జిల్లాలో కేవలం 13వేల మంది మాత్రమే పనులకు వస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పంటల సాగు పూర్తయింది. గ్రామాల్లో వ్యవసాయ కూలీలు పనులు లేక పొట్ట చేతపట్టుకుని జీవనోపాధి, కుటుంబ పోషణ కోసం సుదూర ప్రాంతాలకు కుటుంబ సభ్యులను వెంట పెట్టుకుని వలసబాట పడుతున్నారు. రెండున్నర నెలల నుంచి చేసిన పనులకు కూలి డబ్బులు రాకుంటే ఎట్లా బతకాలని కూలీలు ప్రశ్నిస్తుంటే.. నీటి యాజమాన్య సంస్థ అధికారులు మాత్రం తమ చేతుల్లో ఏమీ లేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూలీ డబ్బులను రెండున్నర నెలలుగా విడుదల చేయకపోవడం వల్లే గ్రామాల్లో ఉపాధి పనులకు రైతులు గానీ, వ్యవసాయ కూలీలు గానీ ఆసక్తి చూపడం లేదని, దూర ప్రాంతాలకు వలస వెళ్లేందుకే చొరవ చూపిస్తున్నారనీ బదులు ఇస్తున్నారు.

రెండున్నర నెలలుగా ఒక్క రూపాయి ఇవ్వలేదు

కర్నూలు జిల్లాలో 5,56,672 మంది వ్యవసాయ, రైతు కుటుంబాలకు చెందిన కూలీలకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులు జాబ్ కార్డులు అందజేశారు. అదే విధంగా నంద్యాల జిల్లాలో 4,60,098 మంది కూలీలు ఉన్నట్లు అధికారులు గుర్తించి వారికి జాబ్‌కార్డులు అందించారు. ఉమ్మడి జిల్లాలో 10 లక్షల మంది వ్యవసాయ కూలీలు, రైతులకు ఉపాధి కార్డులు అందజేసినా ఏటా కనీసం 2లక్షల మందికి కూడా ఉపాధి కల్పించలేని దుస్థితి ఎదురవుతోంది. ఖరీఫ్, రబీ సీజన్లు పూర్తయినా రెండు జిల్లాలో ఈ సంవత్సరం ప్రస్తుత ఫిబ్రవరి నెలలో కనీసం లక్ష మందికి కూడా ఉపాధి కల్పించలేని దుస్థితిని అధికారులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితికి కారణం రెండున్నర నెలలుగా చేసిన పనులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడంతో వ్యవసాయ కూలీలు ఆకలితో అలమటిస్తున్నారు. కర్నూలు జిల్లాలో రూ.5 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.7 కోట్లు కూలీలకు ఇవ్వాల్సి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంలో శ్రద్ధ తీసుకోవడం లేదని కూలీలు ఆరోపిస్తున్నారు.

గ్రామాల్లో స్తభించిన పనులు.. ఉమ్మడి జిల్లాలో రూ.56 కోట్ల బిల్లులు పెండింగ్

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన పనులకు, రైతుల పొలాల అభివృద్ధి, జీవనోపాధిని మెరుగు పరుచుకునేందుకు చేపట్టిన ఇతర పనులకు కర్నూలు



జిల్లాలో రూ.43 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.13 కోట్లు ఇవ్వాల్సి ఉంది. దాదాపు రెండున్నర నెలలైనా చేసిన పనులకు బిల్లులు అందకపోవడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కింద చేపట్టిన మట్టిరోడ్లు, సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువల పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఈ పనులను పర్యవేక్షిస్తున్న జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులు ఎప్పటికప్పుడు కలెక్టర్ల ద్వారా పెండింగ్‌లో ఉన్న ఉపాధి వేతనాలు, చేపట్టిన పనులకు సంబంధించి చెల్లించాల్సిన బిల్లులు వెంటనే విడుదల చేయాలని ప్రతిపాదనలు పంపుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎటువంటి సమాధానం లేకపోవడంతో వ్యవసాయ కూలీలకు సమాధానం చెప్పుకోలేక అధికారులు దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు.

వేలాదిగా వలసబాట

నంద్యాల జిల్లాలో సాగునీటి వనరులు కొంత వరకు మెరుగ్గా ఉండటం వల్ల ఆ జిల్లాలోని గ్రామాల్లో ఇప్పటి దాకా పంటల సాగు పూర్తి కాలేదు. అందువల్ల ఆయా గ్రామాల్లోని వ్యవసాయ కూలీలకు ఉపాధి కొంత మెరుగ్గానే ఉంది. ఇక్కడ జీవనోపాధి కోసం కుటుంబాలను తీసుకుని వలసబాట పట్టే పరిస్థితి కొంత మేరకు తక్కువగానే కనిపిస్తోందని ఆ జిల్లా డ్వామా అధికా రులు చెబుతున్నారు. అయితే కర్నూలు జిల్లాలో మాత్రం వ్యవసాయ కూలీ లు, రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. ఖరీఫ్ సీజన్ పూర్తయ్యే నాటికే గ్రామాల్లో వ్యవసాయ పనులు దాదాపు డిసెంబరు నాటికే ముగిసి పోయాయి. గ్రామాల్లో పనులు లేక పశ్చిమ నియోజకవర్గాలైన మంత్రాల యం, ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ, డోన్ తదితర నియోజకవర్గాల్లోని వ్యవసాయ కూలీలు, రైతులు గుంటూరు, బెంగుళూరు, హైదరాబాదు తదితర ప్రాంతాలకు వలసబాట పడుతున్నారు. కొన్ని చోట్ల దూర ప్రాంతాలకు వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

వ్యవసాయ కూలీలను ఆదుకుంటాం

నవంబరు నెల తర్వాత గ్రామాల్లో ఉపాధి పనులు చేసిన కూలీలకు వేతనాలు చెల్లించలేదు. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే వ్యవసాయ కూలీలు, రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తాం. గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టాలనుకునే వారికి వెంటనే పనులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

# దాపరికం ఎందుకో?

**భూముల మార్పుపై ఆర్‌టీఐ కింద సమాచారం కోరిన రైతులు**

**నిరాకరిస్తున్న అధికారులు**

**కొందరు మొక్కుబడిగా వివరణ**

**తప్పులు బయటపడతాయన్న భయమా?**

**విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 19–** దత్తిరాజేరు మండలం కోమటిపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్లు 48–17, 17–18,72–19లో ఉన్న భూమిపై 2017 నవంబరులో ఏవిధంగా మ్యుటేషన్ చేశారో? ఆ భూమి ఎవరి పేరున ఉండేది? అనే వివరాలు తెలియజేయాలంటూ ఓ వ్యక్తి దత్తిరాజేరు తహసీల్దార్ కార్యాలయానికి సమాచార హక్కు చట్టం కింద గత నెలలో దరఖాస్తు చేశాడు. స్పందించిన రెవెన్యూ అధికారులు ఆ మ్యుటేషన్ ఫైల్ కార్యాలయంలో లేదని సమాచారం ఇచ్చారు.


– గంట్యాడ మండలంలోని రామవరం, గొడియాడ, పెణసాం, చినమానాపురం, రామవరం, బుడతనాపల్లి గ్రామాల్లో 2025 జనవరి 1 నుంచి అదే ఏడాది ఆగస్టు 31 తేదీల మధ్య ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్, డాక్యుమెంట్‌ల జారీ, పీవోఎల్‌ఆర్ ద్వారా ఎన్ని మ్యుటేషన్లు ఆమోదించారు? ఎన్ని తిరస్కరించారు? తెలియజేయాలంటూ ఓ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గత ఏడాది సెప్టెంబరు నెలలో సమాచార హక్కు చట్టం కింద రెవెన్యూ అధికారులను కోరాడు. దీనికి స్పందించిన రెవెన్యూ అధికారులు అరకొర సమాచారం ఇచ్చారని అప్పీలుదారుడు తెలిపారు.

– విజయనగరం మండలం పినవేమలి రెవెన్యూ పరిధిలో ఓ వ్యక్తికి వారసత్వం ద్వారా వచ్చిన భూమిలో పశువుల శాలలు, గడ్డివాములు ఉన్నాయి. 2023 సంవత్సరంలో గ్రామంలో రీసర్వే జరిగిన సమయంలో ఆ భూమిని వేరే వ్యక్తి పేరున రెవెన్యూ అధికారులు మార్పు చేశారు. ఏవిధంగా ఆన్‌లైన్‌లో మార్పు చేశారో? తెలియజేయాలంటూ రాకోడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సమాచార హక్కు చట్టం ద్వారా గత ఏడాది డిసెంబరు 12న మండల రెవెన్యూ అధికారిని కోరాడు. ఇంత వరకూ సమాచారం ఇవ్వలేదు.


ఈ ముగ్గురు అప్పీలుదారులు అడిగిన సమాచారం ప్రజా అవసరాలకు సంబంధించినదే. కానీ సమాచారం ఇవ్వడంలో అధికారులు ఎందుకు దాపరికం చేస్తున్నారు? వారికే తెలియాలి. 2005 సమాచార హక్కు చట్టం ప్రకారం ఏదైనా ప్రభుత్వ కార్యాలయంలో ప్రజలకు సంబంధించి సమాచారం అడిగితే తప్పకుండా ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. రక్షణ వ్యవహారాలు, వ్యక్తిగత సమాచారం మినహా ఏం అడిగినా రాతపూర్వకంగా తెలియజేయాలి అని చట్టం చెబుతోంది. ఒక వేళ ఎక్కువ పేజీలు ఉంటే దానికి అప్పీలుదారుడు నుంచి ప్రభుత్వం నిర్ధారించిన ఫీజు వసూలు చేసి సమాచారం ఇవ్వాలి. కాగా అధికారులకు ఇటీవల కాలంలో అందుతున్న ఆర్‌టీఐ దరఖాస్తులన్నీ చాలా వరకూ రెవెన్యూవే. మరోవైపు జిల్లాలోని కొంతమంది రెవెన్యూ అధికారులు ఇష్టానుసారంగా భూములను ఆన్‌లైన్‌లో మార్పు చేస్తున్నారంటూ ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో కొంతమంది రైతులు, కాస్త అవగాహన ఉన్న వారు సమాచార చట్టాన్ని ఆశ్రయిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రికార్డులు మారిన భూముల వివరాలను అడుగుతున్నారు. అయితే నిబంధనలకు అనుగుణంగా రికార్డులు మారిన భూముల సమాచారం ఇవ్వడానికి ఎటువంటి అభ్యంతరం ఉండదు. అలా జరగలేదు కాబట్టే అధికారులు దాస్తున్నారన్నది ప్రధాన ఆరోపణ. ఇదే విషయమై జిల్లా రెవెన్యూ అధికారి మురళి వద్ద ప్రస్తావించగా అధికారుల కార్యకలాపాలపై అడిగిన సమాచారం మేరకు తెలియజేయాల్సిన బాధ్యత వారిపై ఉందని, ఇవ్వకుండా దాటవేయకూడదని అన్నారు.

# ఎంపీ, మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి

క్రైం కౌంటర్ న్యూస్, కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 19: జిల్లాకు నిధు లిస్తూ బడ్జెట్ సవరించాలని ఎంపీ, మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లు ముట్ట డించాలని సీపీఎం రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. గురు వారం కార్మిక కర్షక భవన్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు పీఎస్. రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి. గౌస్‌దేశాయ్ ప్రవేశపెట్టిన తీర్మానాలను హాజరైన వక్తలు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గస భ్యుడు కే. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. గుండ్రేవుల బాధ్యత తనదని సీఎం చెప్పి నా బడ్జెట్‌లో ఒక్క రూపాయి కేటాయించకపోవడం దారుణ మన్నారు. జిల్లా ఇరిగేషన్ అధికారులు రూ.1450 కోట్లు అడిగితే రూ.400 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. కర్నూలు నుంచి కొత్త రైళ్లు వేయకపోగా ఉండే రైళ్లను కూడ తీసేశారన్నారు. వ్యవసాయ రంగానికి, సాగునీటి ప్రాజెక్టులకు నిధులు అరకొరగా ఉన్నాయని, నిధులు కేటా యించాలని ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులపై ఒత్తిడి తేవాలని అప్పుడే నిధులు సాధించుకోగలమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, ఆర్థిక వేత్త ప్రొఫెసర్ మన్సూర్ రహిమాన్, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే. జగన్నాథం, జిల్లా కార్యదర్శి జి. రామక్రిష్ణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండి. అంజిబాబు తదిత రులు పాల్గొన్నారు.



# సినిమా



## బిగ్ బాస్ సోనియా దంపతుల సంచలన నిర్ణయం

సోనియా ఆకుల.. బిగ్ బాస్ తెలుగు రియాలిటీ షో ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్న వారిలో ఈ బ్యూటీ కూడా ఒకరు. తెలంగాణ ప్రాంతానికి చెందిన ఈ ముద్దుగుమ్మ మొదట కొన్ని సినిమాల్లో నటించి మెప్పించింది. 2019లో రిలీజైన జార్జి రెడ్డి సినిమాతో నటిగా అరంగేట్రం చేసింది సోనియా. ఆ తర్వాత రామ్ గోపాల్ వర్మ తెరకెక్కించిన ఆశా ఎన్ కౌంటర్, కరోనా వైరస్ సినిమాల్లో హీరోయిన్ గా యాక్ట్ చేసింది. ఇలా సినిమాలు చేస్తున్న సమయంలోనే సోనియాకు బిగ్ బాస్ ఆఫర్ వచ్చింది. ఎనిమిదో సీజన్ గా కంటెస్టెంట్ గా హౌస్ లోకి అడుగు పెట్టిన ఆమె తన ఆట, మాట తీరుతో బుల్లితెర ఆడియెన్స్ మనసులు గెల్చుకుంది. అయితే ఎక్కువ రోజులు హౌస్ లో ఉండలేకపోయింది. బిగ్ బాస్ హౌస్ నుంచి బయటకు వచ్చిన వెంటనే వ్యాపారా వేత్త యశ్ ను వివాహం చేసుకున్న సోనియా ఇటీవలే ఓ పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం సినిమా ఇండస్ట్రీకి దూరంగా ఉంటోన్న సోనియా తన భర్త బిజినెస్ ను చూసుకుంటూ బిజీ బిజీగా ఉంటోంది. ఇదిలా ఉంటే సోనియా-యష్ గత కొన్నేళ్లుగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఓ ఎన్జీవోను స్థాపించి అవసరమైన వారికి తమ వంతు సాయం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ దంపతులు ఆర్గాన్ డొనేషన్ పై అందరిలో అవగాహన కల్పిస్తున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో భాగంగా యశ్ సుమారు 450 మంది చేత కళ్లను డొనేట్ చేయించారని తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా తన గురించి తన ఫ్యామిలీ గురించి మరొక ఆసక్తికరమైన విషయాన్ని బయటపెట్టారు సోనియా- యశ్ దంపతులు.. తాను సోనియాతో పాటు తన తల్లిదండ్రులు చనిపోతే మా డెడ్ బాడీలు మా కుటుంబ సభ్యులకు సంబంధం లేదని వాటిని గవర్నమెంట్ హాస్పిటల్ కు రాసిచ్చామని తెలిపారు. ' మేము చనిపోయిన తర్వాత మా బాడీ నుంచి ఆర్గాన్స్ తీసుకుని వాటిని ఇతరులకు ఉపయోగిస్తే ఇతరులకు మంచి జీవితాన్ని అందించిన వాళ్లం అవుతాం. అందుకే మా కుటుంబ సభ్యుల డెడ్ బాడీస్ అన్నీ కూడా గవర్నమెంట్ హాస్పిటల్ కి రాసిచ్చాం' అని సోనియా దంపతులు చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట బాగా వైరలవుతున్నాయి. ఇప్పుడు వీరిపై సర్వత్రా ప్రశంసలు కురుస్తున్నాయి. కాగా తన ఇంటర్వ్యూ చూసినవారు స్వచ్ఛందంగా ఆర్గాన్ డొనేషన్ కు ముందుకు రావాలంటూ కూడా అందరికీ పిలుపు నిచ్చారు సోనియా-యశ్ దంపతులు





## ప్రపంచ కుబేరుల రైస్ ఇది..

సాధారణంగా మన ఇళ్లలో వాడే బియ్యం కిలో రూ. 50 నుండి రూ. 150 వరకు లభిస్తాయి. బాస్మతి రకం అయితే మరో రూ. 100 అదనంగా ఉండవచ్చు. అయితే, ప్రపంచంలో కిన్‌మెమాయ్ ప్రీమియం అనే ఒక ప్రత్యేక రకమైన బియ్యం ఉంది, దీని ధర వింటే చాలా మంది ఆశ్చర్యపోతారు. జపాన్‌కు చెందిన ఈ బియ్యం కిలో కొనాలంటే ఒక బ్రాండెడ్ స్మార్ట్‌ఫోన్ కొనేంత డబ్బు వెచ్చించాలి. ఇది ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన బియ్యంగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది.
జపాన్‌లోని టోయో రైస్ కార్పొరేషన్ ఈ ఖరీదైన బియ్యాన్ని ఉత్పత్తి చేస్తోంది. 2016లోనే దీనికి ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన బియ్యంగా గుర్తింపు లభించింది. మార్కెట్‌ను బట్టి కిలో బియ్యం ధర సుమారు 12,500 నుండి 15,000 రూపాయల వరకు ఉంటుంది. కేవలం ధర మాత్రమే కాదు, దీన్ని పండించే విధానం, ప్రాసెసింగ్ పద్ధతి కూడా ఎంతో విలక్షణంగా ఉంటుంది. కిన్‌మెమాయ్ ప్రీమియం బియ్యం అనేది ఏదో ఒక రకమైన బియ్యం కాదు. జపాన్‌లోని గున్మా, నాగనో, నీగాటా వంటి ప్రాంతాల్లో పండే కోషిహికారీ, పికామారు వంటి ఐదు రకాల మేలైన బియ్యం రకాలను కలిపి దీన్ని తయారు చేస్తారు. ఈ కలయిక దాని ప్రత్యేకతకు ప్రధాన కారణం.
దీని ఉత్పత్తిలో ఆరు నెలల నిరీక్షణ కీలక పాత్ర పోషిస్తుంది. బియ్యం కోత కోసిన వెంటనే మార్కెట్‌లోకి రావు. వీటిని దాదాపు ఆరు నెలల పాటు ప్రత్యేక పరిస్థితులలో నిల్వ చేస్తారు. ఈ ప్రక్రియ వల్ల బియ్యం రుచి, ఆకృతి గణనీయంగా మెరుగుపడతాయని టోయో రైస్ కార్పొరేషన్ చెబుతోంది. ఇది దాని ప్రత్యేకమైన రుచికి, నాణ్యతకు పునాది వేస్తుంది. ప్రత్యేక పాలిష్ విధానం కూడా కిన్‌మెమాయ్ ప్రీమియం బియ్యం యొక్క మరో ప్రత్యేకత. దీని కోసం పేటెంట్ పొందిన ఒక ప్రత్యేకమైన బఫింగ్ ప్రక్రియను ఉపయోగిస్తారు. ఈ పద్ధతి బియ్యం పైపొరను తొలగించినప్పటికీ, అందులోని ముఖ్యమైన పోషక విలువలు ఏమాత్రం నష్టపోకుండా కాపాడుతుంది. దీని వల్ల బియ్యం సహజసిద్ధమైన మంచి గుణాలను నిలుపుకుంటుంది. అద్భుతమైన రుచితో అలరారే ఈ బియ్యంతో అన్నం వండితే అది స్ఫటికాల్లా మెరుస్తుంది. దీని రుచి కొంచెం తియ్యగా, వెన్నలాగా నోట్లో వేసుకోగానే కరిగిపోయేలా ఉంటుందని బియ్యం రుచి చూసిన భోజన ప్రియులు చెబుతుంటారు. ఈ ప్రత్యేకమైన రుచి అనుభవం దీనిని సాధారణ బియ్యం నుండి వేరు చేస్తుంది. కిన్‌మెమాయ్ ప్రీమియం బియ్యం లగ్జరీ గిఫ్ట్‌గా ప్రాచుర్యం పొందింది. టోయో రైస్ కార్పొరేషన్ ఏడాదికి కేవలం 1000 బాక్సులను మాత్రమే ఉత్పత్తి చేస్తుంది. ఈ పరిమిత ఉత్పత్తి దాని విలువను మరింత పెంచుతుంది. జపాన్‌లో దీన్ని ప్రతిరోజూ తినే ఆహార పదార్థంగా కాకుండా, అత్యంత ఖరీదైన, విలాసవంతమైన కానుకగా ఇతరులకు ఇస్తుంటారు. ఒక సాధారణ ఆహార పదార్థం కూడా సరైన నైపుణ్యం, ప్రత్యేక పద్ధతులు తోడైతే ఎలా గిన్నిస్ రికార్డు సృష్టిస్తుందో చెప్పడానికి కిన్‌మెమాయ్ ప్రీమియం ఒక నిదర్శనం.



## లోపల ఉంది నిజంగా అమృతమే..

బూడిద గుమ్మడి జ్యూస్ ప్రయోజనాలు:
బూడిద గుమ్మడి జ్యూస్ అనేక ఆరోగ్య సమస్యలకు నివారణగా పనిచేస్తుంది.
బూడిద గుమ్మడి శరీరంలోని రోగనిరోధక శక్తిని గణనీయంగా పెంచుతుంది.
కడుపునొప్పి, గ్యాస్ వంటి జీర్ణ సమస్యలను నివారిస్తుంది. ప్రేగులను శుభ్రపరిచి జీర్ణక్రియను క్రమబద్ధీకరిస్తుంది.
గుండె ఆరోగ్యం: రక్త ప్రసరణను మెరుగుపరచి గుండె ఆరోగ్యానికి బలాన్ని చేకూరుస్తుంది.
గుమ్మడి కాలేయం, కిడ్నీల పనితీరును మెరుగుపరుస్తుంది.
బూడిద గుమ్మడికాయ అధిక రక్తపోటును అదుపులో ఉంచుతుంది.
రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది.
గుమ్మడిలో ఉండే విటమిన్-ఇ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.. కాల్షియం ఎముకలను దృఢంగా చేస్తుంది.
బాడీని డిటాక్స్ చేయడంలో గుమ్మడికాయ ప్రభావవంతంగా ఉంటుంది. శరీరంలోని వ్యర్థ పదార్థాలను తొలగించడానికి అద్భుతంగా పనిచేస్తుంది.
బూడిద గుమ్మడికాయలో 96% నీరు, అధిక పీచుపదార్థం, తక్కువ కార్బోహైడ్రేట్లు ఉంటాయి. క్యాలరీలు చాలా తక్కువ కాబట్టి బరువు తగ్గాలనుకునే వారికి ఇది అత్యంత ప్రయోజనకరం. ఒక గ్లాసు జ్యూస్ తాగడం వల్ల ఎక్కువసేపు కడుపు నిండినట్లు అనిపించి, చిరుతిండ్ల వైపు మనసు మళ్లదు, అతిగా తినడాన్ని నిరోధిస్తుంది.
బూడిద గుమ్మడికాయ యాంటీ-క్యాన్సర్‌గా కూడా పనిచేస్తుందని పేర్కొంటున్నారు.
యాసిడిటీని నియంత్రించి, శరీరాన్ని చల్లబరుస్తుంది.
ఆందోళన చెందేవారు తరచూ ఈ జ్యూస్ తాగితే మంచి ఫలితం ఉంటుంది.
పిల్లలలో జ్ఞాపకశక్తిని, రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడుతుంది.
జ్యూస్ తయారీ విధానం:
బూడిద గుమ్మడికాయను జ్యూస్ చేసేటప్పుడు తొక్క, గుజ్జు, గింజలను తీయకూడదు. ఎందుకంటే వీటిలో కూడా ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. కాయను శుభ్రం చేసి, ముక్కలుగా కట్ చేసుకోవాలి.
జూసర్ ఉంటే, కట్ చేసిన ముక్కలను నేరుగా జూసర్‌లో వేసి జ్యూస్ చేసుకోవచ్చు. వడకట్టాల్సిన అవసరం ఉండదు.

## దిమ్మతిరిగే షాకిచ్చిన జింబాబ్వే

టీ20 వరల్డ్ కప్ 2026 గ్రూప్బీ చివరి మ్యాచ్‌లో జింబాబ్వే అద్భుత ప్రదర్శనతో శ్రీలంకను కొలంబోలోనే ఓడించింది. ఈ విజయంతో సూపర్-8కు ముందే గ్రూప్--బీలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఇప్పటికే ఆస్ట్రేలియాను ఓడించి సూపర్-8లోకి అర్హత సాధించిన జింబాబ్వే, ఇప్పుడు శ్రీలంకపై గెలిచి 'గ్రూప్ టాపర్'గా నిలవడం విశేషం.
శ్రీలంకపై గెలిచి గ్రూప్--బీలో టాప్‌కు చేరిన జింబాబ్వే..
ఈ మ్యాచ్‌కు ముందు గ్రూప్--బీలో జింబాబ్వే 3 మ్యాచ్‌ల్లో 5 పాయింట్లతో రెండో స్థానంలో ఉండగా, శ్రీలంక 3 మ్యాచ్‌ల్లో 6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. కానీ ఫిబ్రవరి 19న కొలంబోలో జరిగిన మ్యాచ్‌లో జింబాబ్వే శ్రీలంకను ఓడించడంతో పాయింట్ల పట్టిక పూర్తిగా తలకిందులైంది. గ్రూప్ దశలో నాలుగు మ్యాచ్‌లు పూర్తయిన తర్వాత జింబాబ్వే 7 పాయింట్లతో నంబర్--1గా నిలిచింది. శ్రీలంక 6 పాయింట్లతో రెండో స్థానానికి పరిమితమైంది.
శ్రీలంకపై చరిత్ర సృష్టించిన జింబాబ్వే..
శ్రీలంక నిర్దేశించిన 179 పరుగుల లక్ష్యాన్ని జింబాబ్వే 19.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 184 పరుగులు చేసి ఛేదించింది. ఇది ఐసీసీ టోర్నమెంట్‌లలో శ్రీలంకపై జింబాబ్వే సాధించిన తొలి విజయం. అలాగే టీ20 అంతర్జాతీయాల్లో జింబాబ్వేకు ఇది రెండో అతిపెద్ద విజయవంతమైన రన్ చేజ్‌గా నిలిచింది.
కెప్టెన్ సికందర్ రజా 'మ్యాచ్ విన్నింగ్' ఇన్నింగ్స్..
ఈ విజయానికి కెప్టెన్ సికందర్ రజా ప్రధాన కారణం. అతనితో పాటు ఓపెనర్ బ్రియన్ బెన్నెట్ కూడా అద్భుత అర్ధశతకంతో రాణించాడు. బ్రియన్ బెన్నెట్ 48 బంతుల్లో 63 పరుగులు చేయగా, సికందర్ రజా కేవలం 26 బంతుల్లోనే 45 పరుగులు (2 ఫోర్లు, 4 సిక్సర్లు) చేసి 173కి పైగా స్ట్రైక్‌రేట్‌తో జట్టును గెలిపించాడు.
శ్రీలంక బ్యాటింగ్..
ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక 20 ఓవర్లలో 7 వికెట్లకు 178 పరుగులు చేసింది. పథుమ్ నిస్సాంక 41 బంతుల్లో 62 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. పవన్ రత్నాయకె 44 పరుగులతో మంచి సహకారం అందించాడు.



## లిస్ట్ లో టీమిండియా ప్లేయర్లు ఎంతమంది ఉన్నారంటే?

క్రికెట్ అభిమానులలో టీ20 ప్రపంచ కప్ ఉత్సాహం తారాస్థాయికి చేరుకుంది. మైదానంలో ఆటగాళ్ల అద్భుతమైన ప్రదర్శనలతో పాటు, వారి నెట్ వర్త్ కూడా గణనీయమైన దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే చాలా మంది ఆటగాళ్ళు అంతర్జాతీయ క్రికెట్, ఫ్రాంచైజ్ లీగ్‌లు, బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌ల ద్వారా అపారమైన సంపదను సంపాదిస్న్?న్నారు. ఆదాయాల పరంగా టాప్ 10 క్రికెటర్లు గణనీయమైన ఆర్థిక రికార్డులను సృష్టించారు.
మాక్స్‌వెల్, హార్దిక్ ప్రస్థానం..ఈ జాబితాలో ఆస్ట్రేలియా ఆల్ రౌండర్ గ్లెన్ మాక్స్వెల్ అగ్రస్థానంలో ఉన్నాడు. ఐపీఎల్ ఒప్పందాలు, ప్రపంచ టీ20 లీగ్‌లలో పాల్గొనడం వల్ల అతని నికర విలువ విపరీతంగా పెరిగింది. ఆసియా పిచ్‌లపై అతని అనుభవం జట్టుకు చాలా కీలకం. హార్దిక్ పాండ్యా భారత క్రికెట్‌లో అత్యంత విలువైన వ్యక్తులలో ఒకరిగా పేరుగాంచాడు. రోహిత్, విరాట్ టీ20 నుంచి రిటైర్మెంట్ తీసుకున్న తర్వాత, అతను అత్యంత అనుభవజ్ఞుడైన ఆటగాడు, అతని ఐపీఎల్ కెప్టెన్సీ కారణంగా అతని ఆదాయం గణనీయంగా పెరిగింది.
బట్లర్, బుమ్రాలకు భారీ డిమాండ్..ఇంగ్లాండ్ కు చెందిన విధ్వంసక బ్యాట్స్ మాన్ జోస్ బట్లర్ ప్రపంచంలోనే మూడవ అత్యంత ధనవంతుడైన క్రికెటర్. గుజరాత్ జెయింట్స్ అతనికి  లో రూ.15.75 కోట్లు చెల్లిస్తుంది. అతని ప్రపంచ మార్కెట్ విలువ చాలా ఎక్కువ. ప్రపంచంలోని అత్యుత్తమ ఫాస్ట్ బౌలర్లలో ఒకరిగా పరిగణించబడే జస్ప్రీత్ బుమ్రా బీసీసీఐ ఏ-కేటగిరీ ఆటగాడు. బుమ్రా ప్రధాన ఆదాయ వనరు అతని కాంట్రాక్టులు, ప్రధాన బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌లు.
డి కాక్, సూర్యకుమార్ కూడా..
దక్షిణాఫ్రికా వికెట్ కీపర్-బ్యాట్స్ మాన్ క్వింటన్ డి కాక్ రిటైర్మెంట్ నుంచి బయటకు వచ్చి ఈ ప్రపంచ కప్ లో ఆడుతున్నాడు. ఐపిఎల్, ఇతర లీగ్ లలో అతని నిరంతర భాగస్వామ్యం గణనీయమైన ఆర్థిక లాభాలను తెచ్చిపెట్టింది. భారత ప్రస్తుత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఆదాయంలో డి కాక్ తో పోల్చదగినవాడు. అతను ఇప్పుడు ప్రపంచ క్రికెట్ లో అతిపెద్ద వాణిజ్య బ్రాండ్లలో ఒకడు, ముంబై ఇండియన్స్ నుంచి రూ. 16.35 కోట్లు అందుకుంటున్నాడు.
లిస్ట్ లో ఫినిషర్లకు కూడా.. యువ బ్యాట్స్‌మన్ ఇషాన్ కిషన్ తన దూకుడు బ్యాటింగ్, ఐపీఎల్ విజయంతో తక్కువ సమయంలోనే గణనీయమైన సంపదను సంపాదించాడు. ఈ ఎలైట్ జాబితాలో ఉన్న ఏకైక మలయాళీ ఆటగాడు సంజు సామ్సన్. ఇటీవల చెన్నై సూపర్ కింగ్స్ ఒక పెద్ద ట్రేడ్‌లో కొనుగోలు చేసిన సంజు ఐపీఎల్ జీతం రూ.18 కోట్లు సంపాదిస్తాడు. బలమైన అభిమానుల మద్దతు, బ్రాండ్ విలువ అతన్ని ఈ జాబితాలో ఉంచుతాయి. ఆధునిక క్రికెట్‌లో అత్యుత్తమ ఫినిషర్లలో ఒకరైన టిమ్ డేవిడ్, వివిధ దేశాలలో టీ20 లీగ్‌లలో ఆడటం ద్వారా తన సంపదను గణనీయంగా పెంచుకున్నాడు. ఆస్ట్రేలియన్ ఆల్ రౌండర్ మార్కస్ స్టోయినిస్ జాబితాలో పదవ స్థానంలో ఉన్నాడు. మైదానంలో అతని స్థిరమైన ప్రదర్శనలు, ఫ్రాంచైజ్ క్రికెట్‌లో అతని అధిక డిమాండ్ అతన్ని ఆర్థికంగా అగ్రస్థానంలో నిలిపాయి.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com